ఆసుపత్రి నిర్మాణం ఇంకెన్నాళ్లు?

- గత ప్రభుత్వంలో రూ.23 కోట్లు మంజూరు
- కూటమి ప్రభుత్వంలో ముందుకు సాగని వైనం

చింతలపూడి: నియోజకవర్గ ప్రజలు ఎప్పుడెప్పుడా అని అని ఎదురు చూస్తున్న ఆసుపత్రి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో అర్థం కావడం లేదు. చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణం చేపట్టిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటమే ఇందుకు కారణం. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చింతలపూడికి నూరు పడకల ఆసుపత్రిని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసి రూ.23 కోట్ల నిధులను కేటాయించారు. 2020 నవంబర్ 19న ఆసుపత్రి ప్రధాన భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. 95,000 చదరపు అడుగుల వైశాల్యంలో ఆసుపత్రి భవనాలను నిర్మించడానికి నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు. గత ప్రభుత్వ హయాంలో శరవేగంగా జరిగిన నిర్మాణ పనులు ప్రస్తుతం ముందుకు సాగడం లేదు.

2011లోనే..

2011లో నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేశారు. అప్పట్లో రూ.5.44 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. 2012 సెప్టెంబర్ 30న అప్పటి ఎమ్మెల్యే మద్దాల రాజేష్ కుమార్ ఆసుపత్రి నిర్మాణానికి స్థానిక ప్రభుత్వ ఐటీఐ సమీపంలో భూమి పూజ చేశారు. అనంతరం 2013 డిసెంబర్ 17న అప్పటి కేంద్ర జౌళీశాఖ మంత్రి కావూరు సాంబశివరావు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన రాళ్లు వేసి ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభించలేదు. గత టీడీపీ హయాంలో నూరు పడకల ఆసుపత్రి విషయాన్ని పక్కన పెట్టి ఉన్న 30 పడకల ఆసుపత్రినే రూ.80 లక్షలతో తూతూ మంత్రంగా ఆధునికీకరణ చేశారు. లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల నుంచే కాక కృష్ణా జిల్లా, ఖమ్మం జిల్లాల నుంచి కూడా నిత్యం 300 నుంచి 400 మంది రోగులు ఈ ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వస్తుంటారు. గత కొద్ది సంవత్సరాలుగా వైద్యుల కొరతతో రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నూరు పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే వైద్య పరంగా ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందనడంలో సందేహం లేదు.


నత్త నడకన సాగుతున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు

ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి



నియోజకవర్గ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నూరు పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి. పేద రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగింది. సరైన వైద్య సదుపాయాలు లేక రోగులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

–కంభం విజయరాజు,
వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్

రోడ్ల నిర్మాణం చేపట్టాలని ధర్నా


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం: పాడైపోయిన రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కొత్త రోడ్లలో జరుగుతున్న అవినీతిని అరికట్టి దోషులపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాయకులు కేవీ రమణ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో ముఖ్యంగా జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం, బుట్టాయిగూడెం, చింతలపూడి, లక్కవరం ప్రాంతాలకూ వెళ్లే రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌కి వెళ్లే ఏలూరు రోడ్డు కూడా గోతులతో ఉండి ప్రయాణం అంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు సరియం రామ్మోహన్, ఏఐకేఎంఎస్ నాయకులు భూషణం, పీవైఎల్ నాయకులు తగరం బాబూరావు, పీవైఎల్ నాయకులు కెచ్చెల పోతిరెడ్డి, గోగుల పండు, పీడీఎస్‌యూ నాయకులు కె.నాని, బన్నే వినోద్, పీఓడబ్ల్యూ నాయకులు శ్రావణి, కె.రామలక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకులు మరపట్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నూతన కమిటీ నాయకులు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. కొయ్యలగూడెం మండల ప్రచార కన్వీనర్‌గా నియమితులైన తొర్లపాటి వాసు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గురువారం దుద్దుకూరులోని మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలరాజుకు ఆయన డ్రాయింగ్ చిత్ర పటాన్ని బహూకరించారు. బాలరాజు మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు అల్లాడి పోతున్నారని ప్రజలకు అండగా ఉండి, ప్రభుత్వ తీరును ఎండగట్టాలన్నారు. యూత్ నాయకులు వెంకటరమణ, ప్రసాద్, ఎలేటి చంద్రం, పి.రాజశేఖర్, నరేష్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.


మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

దళితులను మోసం చేసిన కూటమి

కొయ్యలగూడెం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ మోసం మరో సారి తేటతెల్లం అయిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు గురువారం ఆరోపించారు. రాజవరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కన్వీనర్ తమ్మిర్చి బ్రహ్మన్న, సర్పంచుల చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏలేటి చిన్న తుక్కయ్యల పాల్గొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ కులాలకు చెందిన యువతకు ఉపాధి అవకాశాల్లో భాగంగా గతంలో దరఖాస్తులు తీసుకున్న కూటమి ప్రభుత్వం ఆ లోన్లను మంజూరు చేయలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజవరం వార్డు మెంబర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, దేవరపల్లి వెంకటేశ్వరరావు, కొడారు వంశీ, పి.కృష్ణ, కె.ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలి

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ఎం.రాజు అధికారులను ఆదేశించారు. గూటాల గ్రామంలో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని, పంచాయతీ సిబ్బంది స్పందించడం లేదంటూ జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గూటాల గ్రామ పంచాయతీ వద్ద డీఎల్‌పీవో, ఎంపీడీవో శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ రవికుమార్ గురువారం గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలో పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు మార్చుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తాగునీరు కలుషితం అవుతోందని, డ్రెయిన్ల పూడిక తీయడం లేదని, వీధి లైట్లు వెలగడం లేదని తదితర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు, అధికారులు చెప్పిన మాటలకు పొంతన లేదని ఆరోపిస్తున్నారు.


విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీవో రాజు

స్థానిక ఎన్నికలపై పట్టు సాధించాలి

కొయ్యలగూడెం: స్థానిక ఎన్నికలలో పట్టు సాధించే దిశగా వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చేయాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పేర్కొన్నారు. గురువారం భీమవరంలోని మోషేన్ రాజును మండల కోకన్వీనర్ బిరుదుగడ్ల ప్రేమ్‌కుమార్, బోడిగూడెం సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, గంగవరం వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిపాటి సోమేశ్వరరావులు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. కొయ్యలగూడెం మండల కన్వీనర్‌గా తాను నియమితులైనందుకు చైర్మన్ అభినందనలు తెలిపారని ప్రేమ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం బాలరాజు, పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరు సునీల్ నాయకత్వంపై కార్యకర్తల్లో విశ్వాసం, నమ్మకం పెరుగుతోందని చైర్మన్‌తో పేర్కొన్నట్లు తెలిపారు.


శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

జంగారెడ్డిగూడెం: సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బయ్యన్నగూడేనికి చెందిన రైతు పెనుమర్తి వరప్రసాద్ హైటెక్ పౌల్ట్రీ ఫారాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగం విద్యార్థులు 28 మంది కోళ్ల ఫారాన్ని సందర్శించి కోడికి అందించే ఆహారం దగ్గరి నుంచి పెంపకం, గుడ్లు సేకరించేంత వరకు అన్ని దశల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ బాబు, అధ్యాపకులు ఆర్.విజయ దీపిక, ఎం.మధు, టీవీ రాంబాబు, జి.వెంకట్‌లాల్, యు.వెంకటాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


క్షేత్ర పర్యటన నిర్వహిస్తున్న విద్యార్థులు

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ ఎన్నిక

కామవరపుకోట: చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ఆదేశాల మేరకు మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో పరిశీలకుడిగా నల్లూరి ప్రభాకరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సూతగాని రామకృష్ణను ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా సిలింతరాజుల సుబ్బారావు, చింతపల్లి రాజు, కుచలపాటి ప్రకాశం, వామిశెట్టి ఏసుబాబు, కార్యదర్శులుగా ఏలేటి చార్లెస్, పెనుమాకుల వీర్రాజు, కుచలపాటి ప్రకాశం, నైనవరపు సుబ్బారావులను ఎన్నుకున్నారు. గ్రామ సోషల్ మీడియా కన్వీనర్‌గా వెలగలేటి సాయిరాజేష్, యువజన విభాగం అధ్యక్షులుగా చిన్నం శంకర్, మైనార్టీ విభాగం అధ్యక్షులుగా షేక్ హుస్సేన్, రైతు విభాగం అధ్యక్షులుగా పాముల సూరిబాబు, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడిగా పదిలం చిన సుబ్బారావు ఎన్నుకున్నారు. రావికంపాడు ఎంపీటీసీ కనుమూరి అంజిరెడ్డి, కనుమూరి ప్రసాదరెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు షేక్ మీరా సాహెబ్, పెండ్ర వెంకటేష్, శ్యామల శ్రీనివాస్ రెడ్డి, కాగితాల శ్రీను, సింహాచలం, అన్నవరపు గణేష్, ఏలేటి గోతియ్య, షేక్ గలీషా పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీ

రణభేరి పోస్టర్ ఆవిష్కరణ


రణభేరి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

జంగారెడ్డిగూడెం: ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రణభేరి (బైక్ జాతా) కార్యక్రమ పోస్టర్‌ను గురువారం యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ వద్ద జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవీ శ్యాంబాబు మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలు బోధనేతర పనులు, యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ ఆధారంగా ప్రమోషన్స్, పీఆర్సీ కమిషన్, డీఏ బకాయిల చెల్లింపు, తదితర అంశాల పరిష్కార నిమిత్తం ఈ బైక్ జాతా నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త

కుక్కునూరు: సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని కుక్కునూరు ఎస్సై రాజారెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం కుక్కునూరు ఎస్టీ బాలికల హాస్టల్ నందు విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళల భద్రత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందిందో మోసాలు కూడా అంతగా పెరిగిపోయాయన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై రాజారెడ్డి

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

చింతలపూడి: చింతలపూడి తహసీల్దార్‌గా కె.స్లీవజోజి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న డి.ప్రమద్వర దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో జంగారెడ్డిగూడెం తహసీల్దార్‌గా పని చేస్తున్న స్లీవ జోజిని చింతలపూడికి పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా అధికారులు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలు అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.


తహసీల్దార్ స్లీవజోజి

పొగాకు ఉత్పత్తులతో క్యాన్సర్

నిడమర్రు: పొగాకు ఉత్పత్తుల వినియోగం వలన క్యాన్సర్ బారిన పడి విలువైన జీవితాన్ని కోల్పోతామని అందువలన పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని డైట్ అధ్యాపకుడు చల్లా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆయన బువ్వనపల్లిలోని ఉన్నత పాఠశాల, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, పలు తరగతుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పొగాకు ఉత్పత్తుల వలన జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యా సంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు, ఖైనీ, గుట్కా వంటి క్యాన్సర్ కారక ఉత్పత్తులు అమ్మడం నిషేధమని, వీటిని అమ్మొద్దని సమీప వ్యాపారులకు నోటీసులు అందజేశారు. పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎన్‌వీ సుబ్బారావు, ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ భారతీలక్ష్మీకుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దత్తాత్రేయునికి పూజలు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో కొలువైన దత్తాత్రేయునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు నిర్వహించి, సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి శుభాకాంక్షలు


ఎంపీ మిథున్‌రెడ్డికి బొకే అందిస్తున్న మాజీ మంత్రి వనిత, పార్టీ నాయకులు

ద్వారకాతిరుమల: గుండుగొలనులోని గరుడా హోటల్‌లో గురువారం జరిగిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు ప్రముఖులతో పాటు, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు. మాజీ మంత్రి తానేటి వనితతో పాటు పార్టీ ద్వారకాతిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ సెల్ విభాగ సంయుక్త కార్యదర్శి షేక్ మస్తాన్ బాషా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి, రాజ్‌కుమార్, పార్టీ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు బొండాడ వెంకన్నబాబు, నారాయణపురం సర్పంచ్ పెద్దిన దిలీప్, గుర్రాల లక్ష్మణ్ తదితరులు మిథున్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో వేడుకలు


జంగారెడ్డిగూడెంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కర్పూరం కవరయ్య గుప్తా ఆధ్వర్యంలో గురువారం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథరావు కార్యాలయం వద్ద నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పార్లమెంట్ పరిశీలకుడు గురునాథరావు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఉభయగోదావరి జిల్లా బూత్ కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, పట్టణ మండల అధ్యక్షులు కర్పూరం గుప్త, ఓరుగంటి నాగేంద్ర, ఏలూరు జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు చింత అనిల్ కుమార్ గౌడ్, ఏలూరు జిల్లా కార్యదర్శులు ముప్పిడి శ్రీను, అయినాల వెంకటరమణమూర్తి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, జెట్టి ఆదిత్య, షేక్ అక్బర్ శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు పీపీఎన్ చంద్రరావు, ఉగ్గం దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు బత్తిన చిన్న, పంతగాని వెంకన్న, కాటన్ డేవిడ్, వెంప ఐజి, కనిగళ్ల ప్రసాద్, భావన ఋషి, కురు సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిప్పాడ వెంకన్న, వీరవెల్లి సోమేశ్వరరావు, కార్యదర్శి రామిశెట్టి కిషోర్, ఉపాధ్యక్షులు మహమ్మద్ ఖబీర్, పిండి రాము, అనుబంధ విభాగాల అధ్యక్షులు కాసర శేషారెడ్డి, పఠాన్ పర్వీజ్, గగ్గల కిరణ్, కత్తి వసంత్, వెన్నపూస కృష్ణారెడ్డి, బోను రాధిక, కాసర సోమిరెడ్డి, దోనేపూడి రమణ, మల్లవరపు నాగపాసు, శిలరపు ప్రశాంత్ రాజ్, మేడపాటి రమేష్ రెడ్డి, దున్న శివ, షేక్ సలీం పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


ఘన జీవామృతాల తయారీని పరిశీలిస్తున్న ఆదివాసీయులు

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలనుకుంటలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని గురువారం సుమారు 50 మంది ఆదివాసీలు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కోసం వీరు తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొమరం భీమ్ నుంచి నాబార్డ్ ఆధ్వర్యంలో వచ్చారు. ముందుగా గ్రామంలోని ఒబిలిశెట్టి గోపాల కృష్ణమూర్తికి చెందిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని పరిశీలించి, పలు అంశాలపై అవగాహన పొందారు. కార్యక్రమంలో ఎస్పీఎంయూ రాథోడ్, నాబార్డ్ పీడీ సతీష్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతిదేవి హైస్కూల్ ప్లస్‌లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను నాయకులు పంపిణీ చేశారు. యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.మహేష్ యాదవ్, సర్పంచ్ తోట ఏసమ్మ, దెందులూరు కోపరేటివ్ సొసైటీ చైర్మన్ కొండయ్య చౌదరి ఉన్నారు.

చేతివృత్తుల విభాగ అధ్యక్షుడిగా రామారావు


జీడికంటి రామారావు

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గ చేతివృత్తుల విభాగ అధ్యక్షుడిగా జీడికంటి రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తన నియామకానికి కృషి చేసిన నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, రాష్ట్ర కార్యదర్శి మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు, పార్టీ సీనియర్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో చేతివృత్తుల వారి సమస్యలను పరిష్కరించేందుకు, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని రామారావు తెలిపారు. పలువురు నాయకులు, కార్యకర్తలు రామారావును అభినందించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి


ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ సభ్యులు

చింతలపూడి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శివ కుమార్, కోశాధికారి ఎం.క్రాంతికుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ తొలి నుంచి సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. నూతన కమిటీ ప్రతినిధులుగా ఎన్.సుశాంత్, బి.చరణ్, టి.అభిరామ్, జి.మనోజ్, కె.బాబాచరణ్, టి.సుజాత, ఎ.మహాలక్ష్మి, ఎ.సిరిచందన, పి.వైష్ణవి, సీహెచ్ భవానీదేవి, పి.కిరణకుమారి, ఎస్.మౌనిక, డి.దుర్గ సాయిలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ


విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రామారావు

లింగపాలెం: శింగగూడెం ఎంపీపీ స్కూల్‌ను మండల విద్యాశాఖాధికారి కె.రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ప్రమాణాలపై పరిశీలన చేశారు. అలాగే విద్యార్థుల టెక్స్ట్ బుక్స్‌ను, వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. బడి తోట కార్యక్రమంలో భాగంగా పెంచుతున్న వంగ, బెండ, టమాట మొక్కలను పరిశీలించి బడితోట నిర్వహణపై అభినందించారు.

ఫాసిస్టు వ్యతిరేక సదస్సు విజయవంతం చేయండి

కొయ్యలగూడెం: ఈ నెల 27వ తేదీ విజయవాడలో నిర్వహించే ఫాసిస్టు శక్తుల వ్యతిరేక సదస్సు విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు పిలుపు ఇచ్చారు. గురువారం కన్నాపురం రోడ్డులోని కార్యాలయంలో మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ ఎలికే రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డి.రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చాలని వేడుకోలు


గుంతలతో అధ్వానంగా మారిన రహదారి

లింగపాలెం: ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో నడి రోడ్డుపై గుంతలు పడినా అందరూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తాత్కాలికంగా పూడ్చినా పనులు నాసిరకంగా చేయడంతో మళ్లీ గుంతలు పడుతున్నాయి. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.